## క్లుప్తంగా

### తాగునీటి సమస్యలకు పరిష్కారం



బి.కోడూరులో ట్యాంకు పైపులు మారుస్తున్న దృశ్యం

మహానంది: మంచినీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఈఓఆర్డీ శ్రీనివాసులు తెలిపారు. బండిఆత్మకూరు మండలం బి.కోడూరు, ఏ.కోడూరు గ్రామాల్లో ఆదివారం మంచినీటి సరఫరాలో భాగంగా ట్యాంకుల వద్ద పైపులైన్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు నూతనంగా పైపులను అమర్చారు. ఏ.కోడూరులో నీటి ట్యాంకు వద్ద నూనతంగా వాల్వ్‌లను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మంచి నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూస్తున్నట్లు తెలిపారు.

### బోర్లకు మరమ్మతులు



బోరుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

పాములపాడు: మండలకేంద్రమైన పాములపాడులో నీటి సమస్యను నివారించేందుకుగాను మూడు చేతిపంపులకు మరమ్మతులు చేయించినట్లు సర్పంచ్ భాగ్యమ్మ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామంలోని తాగునీటి పథకాల బోర్లలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో కొంతమేర నీటిసమస్య నెలకొందన్నారు. విషయం తెలిసిన వెంటనే గ్రామంలోని బోర్లకు మరమ్మతులు చేయించి నీటిసమస్యను నివారించినట్లు తెలిపారు.

### ఇరువర్గాలపై కేసు నమోదు

పగిడ్యాల: స్థలం విషయంలో ఘర్షణపడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జయశేఖర్ ఆదివారం తెలిపారు. స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన ఎల్లప్ప, వెంకటరాముడు, భార్గవి, గంగన్న, శ్రీనివాసులు, భరత్‌కుమార్, గంగన్న ఇంటి ముందు స్థలం కోసం ఇరువర్గాలుగా ఏర్పడి వాగ్వాదానికి దిగి ఘర్షణపడ్డారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మిక సంఘం నంద్యాల జిల్లా నూతన కమిటీని ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నిధులు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం 44 లేబర్ చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను హరిస్తుందని మండిపడ్డారు. మృతి చెందిన కార్మికులకు రూ.10లక్షలు బీమా చెల్లించాలని కోరారు. నంద్యాల అధ్యక్షుడిగా అజీజ్, ఉపాధ్యక్షుడిగా ఫరూక్ ఖాజా, ప్రధాన కార్యదర్శిగా మాబాషా, సహాయ కార్యదర్శిగా శంవార్, మాబుల్, కోశాధికారిగా చాంద్, నూర్ బాషాతో పాటు 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

### విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి




మాట్లాడుతున్న రెమీష్‌షేక్

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థుల్లో నైతిక విలువలు పొందించేందుకు స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా కృషి చేస్తుందని ఎస్‌ఐఓ జాతీయ అధ్యక్షుడు బ్రదర్ రెమీష్ షేక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులతో ఎస్‌ఐఓ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రోషన్ జమీర్ మాట్లాడుతూ యువ శక్తి మనదేశ సంపత్తి అని, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉత్తమ పౌరులుగా దేశం పునః నిర్మాణంలో పాల్గొనాలని కోరారు. మౌలానా ఇదాందుల్లా, నూర్ అహమ్మద్ మదానీ, అబ్దుల్‌సమ్మద్, మహమ్మద్ అబులైజ్ పాల్గొన్నారు.

### పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు మొక్కు చెల్లింపులో భాగంగా గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి అభిషేకాలు చేసి హారతులు పట్టారు.

# ‘ఆసరా’తో మహిళల్లో ఆనందం

- పొదుపు మహిళల ఖాతాల్లో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత నగదు జమ
- నియోజకవర్గంలో 4,067 సంఘాలకు లబ్ధి
- బ్యాంకు ఖాతాలకు రూ.27.28 కోట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు



మెప్మా కార్యాలయంలో పొదుపు మహిళల సమావేశం (ఫైల్)

నందికొట్కూరు: వైఎస్సార్ ఆసరా పథకంతో ఎన్నో డ్వాక్రా మహిళా సంఘాలకు మేలు చేకూరింది. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఈ పథకం కింద నాలు విడతలుగా నగదు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు నాల్గవ విడత నిధులను ప్రభుత్వం ఈనెల 15న బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. వాస్తవానికి ఎన్నికల ముందే నగదు జమ కావాల్సి ఉన్నా టీడీపీ నేత చంద్రబాబు కుట్రపన్ని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం వల్ల జమ కాలేదు. ప్రస్తుతం పోలింగ్ ముగియడంతో నగదును ప్రభుత్వం ఖాతాల్లో జమ చేయడంతో పొదుపు మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు విడతలో రూ.109.05 కోట్లు లబ్ధి**

2019 ఏప్రిల్ 11కు ముందు స్వయం సహాయక సంఘం సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లింపు చేస్తున్న సంఘాలకు నాలుగు విడతలుగా వైఎస్సార్ ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మాఫీ చేసింది. ఈ పథకం ద్వారా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలో 4,067 సంఘాలకు గాను నాల్గవ విడతగా

**మండలాల వారీగా మంజూరైన నగదు వివరాలు**

| మండలం | పొదుపు గ్రూపులు | సభ్యులు | మొత్తం లబ్ధి (రూ. కోట్లలో) | నాల్గో విడత (రూ.కోట్లలో) |
|---|---|---|---|---|
| నందికొట్కూరు | 692 | 7,284 | 20.55 | 5.15 |
| జూపాడుబంగ్లా | 725 | 7,384 | 15.37 | 3.84 |
| కొత్తపల్లి | 533 | 5,524 | 13.28 | 3.32 |
| మిడ్తూరు | 596 | 6,127 | 12.85 | 3.22 |
| పగిడ్యాల | 756 | 7,667 | 27.29 | 6.82 |
| పాములపాడు | 765 | 8,019 | 19.71 | 4.93 |

రూ.27,27,03,166లు మంజూరు అయ్యాయి. మొత్తం నాలుగు విడతల్లో రూ.109.05 కోట్లు లబ్ధి చేకూరింది. అంతే కాకుండా వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా లాంటి పథకాలు మహిళలకు అందిస్తూ మహిళా పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని మహిళలు చెబుతున్నారు. ఇలాంటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ మళ్లీ రావాలంటూ మహిళలు కోరుకుంటున్నారు.

**ఆర్థిక వెసులుబాటు**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేయడం ఆనందంగా ఉంది. మా వెన్నెల గ్రూపులో నాల్గో విడత ఆసరా డబ్బులు ఒక్కొక్కరికి రూ.6వేలు జమ అయ్యాయి. గ్రూపు మొత్తానికి రూ.60వేలు వచ్చాయి. మొత్తం నాలుగు విడతల్లో ఒక్కొక్కరికి రూ.24వేలు లబ్ధి చేకూరింది. డ్వాక్రా మహిళలను ఆర్థికంగా రాణించేందుకు జగనన్న ఎంతో కృషి చేస్తున్నారు. ఇలాంటి సీఎం మళ్లీ మళ్లీ రావాలని కోరుకుంటున్నాం.

– సునీత జీ. వీరాపురం, కొత్తపల్లి మండలం

**సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం**



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వైఎస్సార్ ఆసరా పథకంతో బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో కష్టాల నుంచి ఆదుకోవడం హర్షణీయం. మా ఝాన్సీ గ్రూపులో ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున బ్యాంకులో పడ్డాయి. నాలుగు విడతల్లో నాకు రూ.16వేలు వచ్చింది. జగనన్న వచ్చిన తర్వాతనే మా మహిళల జీవితాల్లో వెలుగులు నిండాయి. మళ్లీ వైఎస్ జగనన్న సీఎం కావాలి.

– సువర్ణమ్మ, ఉప్పలదడియా, మిడుతూరు మండలం.

### అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దు



లాడ్జీల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న లాడ్జీలు, ఫంక్షన్‌హాల్‌లో కొత్త వారికి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి ఆశ్రయం కల్పించవద్దని డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి సూచించారు. ఆదివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో లాడ్జీ, ఫంక్షన్ హాళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అన్ని డార్మెటరీలపై నిఘా ఉంచామని చెప్పారు. కొత్త వారు లాడ్జీల్లోకి ప్రవేశించేటప్పుడు పూర్తి వివరాలు తెలుకోవాలని చెప్పారు. విద్య, విధుల్లో భాగంగా, ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన వారిని మాత్రమే లాడ్జీల్లోకి అనుమతించాలని కోరారు. బె బెట్టింగ్ , మద్యం సేవిస్తూ లాడ్జీల్లో బస చేసే వారిపై వెంటనే తమకు సమాచారం అందించాలని ఆదేశించారు. సీఐలు రాజారెడ్డి, నరసింహులు, దస్తగిరిబాబు, ఎస్‌ఐ నవీన్ పాల్గొన్నారు.

### సింగరాజుపల్లె వాసికి డాక్టరేట్



ప్రొఫెసర్ ఎస్.మధుసూదన్ రావుతో నక్క ప్రవీణ్ కుమార్

కొత్తపల్లి: మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మజరా గ్రామమైన సింగరాజుపల్లె గ్రామ వాసికి శనివారం వీఐటీ–ఏపీ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. గ్రామానికి చెందిన నక్క సత్యాలు, యేసురత్నమ్మల కుమారుడు నక్క ప్రవీణ్‌కుమార్ వీఐటీ–ఏపీ యూనివర్సిటీ అమరావతి, విజయవాడలో ఫిజిక్స్(భౌతిక శాస్త్రం)లో పీహెచ్‌డీ చేస్తున్నాడు. ఇందులో భాగంగానే ప్రొఫెసర్ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ‘జింకు ఫాస్ఫైట్‌లో పలుచని అయస్కాంత సెమీ కండక్టర్ల సంశ్లేషణ – ఎక్స్ (ఎక్స్=ఇనుము, నికెల్ మరియు మాంగనీస్) గది ఉష్ణోగ్రత వద్ద ఫైరో అయస్కాంతత్వం కోసం వ్యవస్థ’ అనే అంశంపై పరిశోధన చేశాడు. వీఐటీ–ఏపీ యూనివర్సిటీలో శనివారం జరిగిన సెమినార్, వైవా కార్యక్రమంలో తన పరిశోధన గ్రంథాన్ని సమర్పించాడు. ఈ పరిశోధనకు గాను యూనివర్సిటీ అధికారులు ప్రవీణ్ కుమార్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.



వెలుగోడు హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం,



రేగడగూడురు పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

## అ‘పూర్వ’ కలయిక

వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల, రేగడగూడురు జెడ్పీ పాఠశాలల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. వెలుగోడు జెడ్పీ హైస్కూల్‌లో 1996– 1997వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు, రేగడగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–2008వ సంవత్సరం పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. వత్తిరీత్యా, ఉద్యోగరీత్యా వేరు వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా హాజరై తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను గౌరవించి సన్మానించారు. ఉపాధ్యాయులకు పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు మేళతాళాలతో పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. ముందుగా స్వర్గస్తులైన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థుల ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సరస్వతి పూజ, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, మక్బుల్ బాషా, మొమిన్ వలి, మహమ్మద్ ఇక్బాల్, సిరివెళ్ల ఖయ్యూం, రవిశంకర్, రాబర్ట్, హుస్సైన్, గని సార్, ఈశ్వరయ్య, మొహమ్మద్ అక్బర్, నారాయణ స్వామి, సలాం ఖాన్, సంజీవ రాజు ఇబ్రహీం ఖాన్, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ హెగ్డేలతో పాటు నాన్ టీచింగ్ స్టాఫ్ మజార్ అలీ ఖాన్, లక్ష్మణ్‌లను శాలువాలు, పూలమాలలు మెమెంటులతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ఇంతియాజ్ అహ్మద్, మల్లికార్జున, గోపాల్, అబ్దుల్ వహీద్, సంగీత, సుజాత, ప్రసన్న, లావణ్య, లతా, శాంతిలకు పూర్వవిద్యార్థుల బృందం కృతజ్ఞతలు తెలిపారు.

**రేగడగూడురులో..**

పూర్వ విద్యార్థులు దాదాపు 16 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వపు హెచ్‌ఎం అబ్దుల్ ఖాదర్, లక్ష్మీ కుమారి, శివ రామి రెడ్డి, మహమ్మద్ షఫీ (ప్రస్తుత హెచ్‌ఎం ), సహ ఉపాధ్యాయులు బసి రెడ్డి , మోదిన్ నాయక్ , సంజీవ రాజు, షణ్ముఖ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, ఆచారి, ఆనందరావు, భాస్కర్, సుబ్బారెడ్డి, పెద్ద రామి రెడ్డి, నాగలక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థికి మెమొంటో అందజేస్తున్న డాక్టర్ శివప్రసాద్



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న పద్మశాలీయ సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులు చదువుతో పాటు సనాతన ధర్మాన్ని అలవర్చుకోవాలని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి అంకాలజిస్ట్ డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ కార్తీక పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బైటిపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో మనఊరు, మన గుడి–మనబాధ్యత ఆధ్వర్యంలో ఇటీవల పదవ తరగతి ఉత్తీర్ణులైన 120మంది విద్యార్థులకు వేద ఆశీర్వచనంతో పాటు నోట్ పుస్తకాలు అందజేశారు. నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి, డాక్టర్ భార్గవవర్ధన్‌రెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో..**

ఇటీవల పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన పద్మశాలీయ విద్యార్థులకు ఆదివారం శ్రీ భద్రావతి భావనారుషి దేవాలయ కల్యాణ మండపంలో ప్రతిభకు పట్టాభిషేకం అనే కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 85మంది పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వరుసగా రూ.10వేలు, రూ.7500, రూ.5వేలు, కన్సోలేషన్ బహుమతి కింద ప్రతి ఒక్కరికీ రూ.2వేలు, ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేశామని చెప్పారు. లక్ష్మీనారాయణ, గాజుల శంకర్, వేణు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, బ్రహ్మానందం , వెంకటరామయ్య, కౌన్సిలర్ పురందర్ పాల్గొన్నారు.

### హోరాహోరీగా కబడ్డీ పోటీలు

పాణ్యం: మండల పరిధిలోని కొండుజూటూరు గ్రామంలో సీఎస్‌ఐ చర్చి ప్రారంభోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా హోమ్ టీమ్ కబడ్డీ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. గెలుపోటలమును సమానంగా స్వీకరించాలన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 20 జట్లు పోటీల్లో తలపడనున్నట్లు తెలిపారు. పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. విజేతలుగా నిలిచిన జట్లకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందించనున్నారు. క్రీడలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. చర్చి నిర్వాహకులు క్రీడాకారులకు, చర్చిని సందర్శించేందుకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించారు. చర్చి సంఘ పెద్దలు, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు



జూపాడుబంగ్లాలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది



గ్రామస్తులకు సూచనలు ఇస్తున్న సీఐ, ఎస్‌ఐలు

జూపాడుబంగ్లా: ఓట్ల కౌంటింగ్‌కు ముందు, కౌంటింగ్ తర్వాత ఎవరైనా అల్లర్లు, అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా గ్రామాల్లో రూరల్ సీఐ విజయభాస్కర్, టౌన్ సీఐ ప్రకాశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసుకవాతు నిర్వహించారు. రూరల్ సీఐ మాట్లాడుతూ పోలీసు యాక్టు 30తో పాటు 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు వివాదాలకు దూరంగా ఉండి ప్రశాంతంగా, ఐక్యమత్యంతో మెలగాలన్నారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఉన్నందున వారు ఎక్కడి వెళ్లకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా పేల్చడానికి అనుమతుల్లేవని చెప్పారు. ఎవరైనా అల్లర్లు సృష్టించినా, ఘర్షణలకు పాల్పడినా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్, నాగార్జున, జయశేఖర్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

**ఘర్షణలకు దిగితే కటకటాలే**

మహానంది: ఎన్నికల ఫలితాల రోజున గ్రామాల్లో ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కటకటాల వెనక్కి పంపడం ఖాయమని సీఐ శివకుమార్‌రెడ్డి హెచ్చరించారు. బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామంలో ఆదివారం బండిఆత్మకూరు, మహానంది, గోస్పాడు ఎస్‌ఐలు మల్లికార్జున, నాగేంద్రప్రసాద్, నాగార్జునరెడ్డి, సిబ్బందితో కవాతు నిర్వహించారు. సీఐ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు ఇరు పార్టీల నేతలు సహకరించాలన్నారు. వ్యక్తిగత, పార్టీల పేరుతో గొడవకు దిగి ఘర్షణ వాతావరణం కలిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. గ్రామస్తులతో ప్రధాన కూడళ్ల వద్ద సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. దీంతో పాటు గ్రామంలో ఓ కుటుంబానికి చెందిన ఇద్దరి మధ్య గొడవ జరగగా ఇరువురిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఎస్‌ఐ మల్లికార్జున చెప్పారు.

## అడుగంటిన జలాలు.. జనాలకు ఇక్కట్లు



కొత్త ముచ్చుమర్రి మినీ ట్యాంక్ వద్ద బిందెలతో నిరీక్షిస్తున్న దృశ్యం

పగిడ్యాల: భూగర్భ జలాలు అడుగంటిపోవడం వలన గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొని తాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. మండలంలోని నెహ్రూనగర్, కొత్త ముచ్చుమర్రి, ఎల్లాల, బీరవోలు, పగిడ్యాల, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట తదితర గ్రామాల్లోని ప్రజలు తాగునీటి అవసరాలు తీరక అల్లాడిపోతున్నారు. దీంతో మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకుల నీళ్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. గ్రామాల్లోని చేతి పంపులు నిరుపయోగంగా దిష్టిబొమ్మలుగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు చేతిపంపుల మరమ్మతులు చేయించాలని మండల సర్వసభ్య సమావేశాల్లో అధికారుల దృష్టికి తెచ్చిన పట్టించుకునే నాథుడు లేరని సర్పంచ్‌లు వాపోతున్నారు. నిరుపయోగంగా మారిన చేతిపంపులను మరమ్మతులు చేయడానికి బోర్ మెకానిక్ లేకపోవడం ప్రజలకు శాపంగా మారిందని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ల వద్దకు వెళ్లి క్యానుకు రూ. 40 నుంచి రూ. 50ల వరకు రుసుము చెల్లించి తాగు నీటి కొనుగోలు చేస్తున్నామని వెల్లడి చేస్తున్నారు. ఇప్పటికైన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**కోడ్ ఉన్నందున కొత్త వర్కులు చేయడం లేదు**

జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కోడ్ ముగిసిన వెంటన కొత్త వర్కులకు టెండర్లు పిలుస్తాం. ప్రత్యేకంగా ఏ గ్రామంలో సమస్య తీవ్రంగా ఉందో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రజల దాహార్తిని తీర్చుతాం. మండలానికి జలజీవన్ మిషన్ వర్కులు కూడా మంజూరు అయ్యాయి. కోడ్ ముగిసిన వెంటనే పనులు చేపట్టి సమస్య లేకుండా చూస్తాం.

– శివకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ. పగిడ్యాల

### వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పాణ్యం: ఈనెల 22వ తేదీన పాణ్యంలో వ్యక్తి అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ ఆదివారం తెలిపారు. వివరాలు.. హైదరాబాద్ పట్టణం అసిస్ నగర్‌కు చెందిన వి.శంకర్ (74), పసుపులేటి శ్రీనివాసులు మద్యం మానుకునేందుకు పాణ్యంలో ఉన్న సుంకులా పరమేశ్వరి అలయం వద్దకు ఈనెల 22వ తేదీ వచ్చారు. ఆలయంలో ఇచ్చే తాయత్తు, తీర్థం స్వీకరించి అక్కడే విశ్రాంతి తీసుకున్నారు. కొద్దిసేపటికే వి.శంకర్ కనిపించకుండా పోయాడన్నారు. శంకర్ కుమారుడు సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అదృశ్యమైన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఘనంగా అమ్మవారి జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామంలో వెలసిన శ్రీ నిదానంపాటి లక్ష్మీబాలత్రిపురసుందరి అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మహిళలు ఉపవాసాలతో మొక్కులు చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## విద్యతో పాటు కళలను ప్రోత్సహించాలి



విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన



జ్యోతి ప్రజ్వలన చేసి ముగింపు ఉత్సవాలను ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

నంద్యాల(వ్యవసాయం): తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు కళలు, లలిత కళలు, క్రీడలపైన దృష్టి సారించి వారి అభివృద్ధికి తోడ్పడాలని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాసాధన 2024 ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళారాధన సంస్థ 23 సంవత్సరాలుగా లయన్స్‌క్లబ్, ఐఎంఏ, రోటరీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ముగింపు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పిల్లల నైపుణ్యాలను వెలికి తీయడానికి నెల రోజులుగా వారికి నేర్పించడం ఎంతో సాహసోపేతమైందన్నారు. రిటైర్డు జిల్లా విద్యాశాఖ అధికారి గుర్రాల రామకృష్ణయ్య వార్షిక పురస్కారాలను అందజేశారు. బాలరత్న ప్రతిభా పురస్కారం, సరయూ, యువరత్నా ప్రతిభా పురస్కారాలు అందజేసి సత్కరించారు. అనంతరం విద్యార్థుల శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యం, ఆధునిక నృత్యం, సినీ లలిత గానాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే నెల పాటు శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు మెమొంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. కళారాధన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ, శివకుమార్‌నాయుడు, రంగనాథ్, చంద్రమోహన్, తదితర లయన్స్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.